క్లుప్తంగా

వీర జవాన్‌కు నివాళి



సీతారామపురం: వీర మరణం పొందిన మురళీనాయక్‌కు మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య ఘన నివాళులర్పించారు. మురళి చిత్రపటానికి పూలమాల వేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సులపై శిక్షణ



మాట్లాడుతున్న సిబ్బంది

సంగం: పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు మండల కేంద్రమైన సంగం జెడ్పీ హైస్కూల్లో హసనాపురం ఐటీఐ సిబ్బంది రాజశేఖర్, శ్రీధర్‌బాబు ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. హెడ్‌మాస్టర్ బుజ్జయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా వి.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి



ఆహ్వాన పత్రికలు పంపిణీ చేసిన నిర్వాహకులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరులో ఈనెల 25వ తేదీన జరిగే హనుమాన్ శోభాయాత్రకు ప్రతి గ్రామం నుంచి భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని నిర్వాహకులు పుల్లారెడ్డి కోరారు. మండలంలోని వాశిలిలో స్థానిక దేవాలయాల వద్ద ప్రజలకు ఆహ్వానపత్రికలు అందజేసి కార్యక్రమ నిర్వహణపై చర్చించామని మంగళవారం తెలిపారు.

ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్ర సందర్శన

ఆత్మకూరు రూరల్: మండలంలోని ముస్తాపురంలో స్థానిక రైతు రామాల రత్నాకర్‌రెడ్డి మూడెకరాల్లో వివిధ పండ్ల తోటలు కలిగిన ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. నాయకులు శ్రీనివాసులురెడ్డి, దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి తరగతులు



మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా కేంద్రంలో జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. తల్లికి వందనం ఇవ్వలేదన్నారు. డిగ్రీ విద్యార్థులకు విద్య, వసతి దీవెన బకాయిలు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలిచిందన్నారు. సమావేశాల్లో ఇలాంటి సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసి ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తామని ప్రకటించారు. నానీ, విక్రమ్ పాల్గొన్నారు.

మోటార్‌బైక్ చోరీ

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని జవ్వాగుంటపాళెంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌బైక్‌ను చోరీ చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన నల్లబోతుల రమేష్ సోమవారం రాత్రి తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేశాడు. మంగళవారం తెల్లవారుజామున చూసేసరికి అది కనిపించలేదు. దీంతో పోలీసులు ఫిర్యాదు చేశాడు.

అన్నదాత సేవకు దూరంగా..

రైతు భరోసా కేంద్రాలు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటిని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. అన్నదాతలకు అన్ని విధాలా ఉపయోగపడేలా చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే కేంద్రాల విషయంలో కుట్రపూరితంగా వ్యవహరించింది. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. కానీ నేడు వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు.

- రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- రేషనలైజేషన్ పేరుతో కుదింపునకు కుట్ర
- ఇప్పటికే వాటిల్లో అందని సేవలు



గరిమెనపెంటలోని కేంద్రం (ఫైల్)

కొండాపురం: అన్నదాతల కోసం నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాయితీ విత్తనాలు, ఎరువులు, పంటల సాగుకు అవసరమైన సలహాలు, ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ, ధాన్యం కొనుగోలు, పశుదాణా సరఫరా తదితర సేవలను అందించేలా వాటిని తీర్చిదిద్దారు. సొంత భవనాలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో రైతాంగం తమకు సమీపంలోనే విశేష సేవలను పొందారు.

వీరొచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. రాయితీ విత్తనాలు ఇవ్వడం మానేసింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందించింది. అది కూడా రైతు సేవా కేంద్రాల నుంచి కాకుండా అధికశాతం సింగిల్ విండోల ద్వారా విక్రయాలను చేపట్టారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలుండే గ్రామాల్లో మాత్రమే కేంద్రాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గాల్లో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో కేంద్రాలు	
కొండాపురం	13
జలదంకి	13
కలిగిరి	14
ఉదయగిరి	10
సీతారామపురం	9
దుత్తలూరు	11
వరికుంటపాడు	12
వింజమూరు	11

కొనసాగించాలి



రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలి. వాటి వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. ప్రధానంగా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే పొందే అవకాశం ఉంటుంది. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– బండ్లమూడి మహేంద్ర, కొమ్మి, రైతు

ఎరువులు అందుబాటులో ఉండేవి



గతంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎప్పుడూ ఎరువులు అందుబాటులో ఉండేవి. గ్రామాల్లో రైతులకు సేవలందిస్తున్న కేంద్రాలు మూతపడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– పైడి శ్రీనివాసులు, తూర్పుబ్రహ్మణపల్లి, రైతు

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

జలదంకి: కావలి పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి పునః ప్రతిష్ఠా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ పాలకవర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులు మంగళవారం తెలిపారు. 17వ తేదీ సాయంత్రం శృంగేరి శారద పీఠ ఉత్తరాధికారి జగద్గురు శ్రీవిధుశేఖర భారతికి పూర్ణకుంభ స్వాగతం, తర్వాత పీఠం పూజ, ధూళిపూజ, అనంతరం ఉపన్యాసం ఉంటుందన్నారు. 18న మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

బస్సు సర్వీస్ కోసం వినతి

ఉదయగిరి రూరల్: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని గండిపాళెం వయా పెద్దిరెడ్డిపల్లె మార్గంలో షటిల్ సర్వీసు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో ఉదయం పూట ఉదయగిరి వచ్చేందుకు ఒక్క ఆర్డినరీ సర్వీసు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 7.30 గంటల్లోపే రెండు లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసు వెళ్లిపోవడం, సాయంత్రం వరకు ఆర్డినరీ సర్వీసులు లేవు. అధిక చార్జీలు వెచ్చించి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని అనేకమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ సర్వీసు కొంతమేర ఉపయోగకరంగా ఉండేది. వేసవి సెలవులు కావడంతో దానిని రద్దు చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పుర వీధుల్లో ఊరేగింపు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని నల్లగొండ్లలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామికి వివిధ పూజలు చేశారు. అనంతరం స్వామి గజవాహనంపై కల్యాణమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని బుధవారం ఉదయం నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు రానున్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని..



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

ఉదయగిరి: పట్టణంలోని బాలాజీ నగర్‌లో ప్రధాన మురుగు కాలువపై అక్రమంగా నిర్మాణ పనులు చేపట్టగా మంగళవారం సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం, ఎస్సై శ్రీనివాసులు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఓ వ్యాపారి తన దుకాణం ముందున్న కాలువపై పిల్లర్లు ఏర్పాటుచేసి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయంపై పలువురు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు పోలీసుల సహకారంతో అక్కడి చేరుకున్నారు. నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని ఎస్సై తెలిపారు. అయితే ఆక్రమణదారుడు వినకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత అధికారులు తమ సిబ్బందితో సదరు నిర్మాణాన్ని తొలగించారు.

పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 380 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 485 బేళ్లు రాగా వాటిలో 380 బేళ్లను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు వెల్లడించారు. 49,562.2 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,24,15,795.40ల వ్యాపారం జరిగిందన్నారు. గరిష్ఠంగా కిలోకు రూ.280, కనిష్ఠంగా రూ.210 లభించిందన్నారు. సగటు ధర రూ.250.51గా నమోదైనట్లు తెలిపారు. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

- కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 361 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. 276 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 85 బేళ్లను తిరస్కరించారు. నిర్వహణాధికారి టి.ఇషాక్ స్వర్ణదత్ మాట్లాడుతూ సరాసరి కిలో పొగాకుకు రూ.248.41 లభించిందన్నారు. 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ఆర్‌ఎస్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



ఎం.శివచరిత (10వ తరగతి)



లక్ష్మీహాసిని (12వ తరగతి)

జలదంకి: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) మంగళవారం విడుదల చేసి ఫలితాల్లో గౌరవరంలోని ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన పది, 12వ తరగతి విద్యార్థులు ప్రతిభ చూపారు. పదిలో ఎం.శివచరిత 97.4 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. ఎం.మనస్విని 97.2 శాతం, కె.చేతన్ నాగసాయి, జీవీ సంజన 96.6 శాతం సాధించారు. 100 శాతం ఫస్ట్ క్లాస్ నమోదైంది. 89 శాతం డిస్టింక్షన్ సాధించారు. 12వ తరగతిలో లక్ష్మీహాసిని 92.4 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. డి.భవ్యశ్రీ 91.4 శాతం, బి.నిఖిలేష్ 90.6 శాతం సాధించారు. 100 శాతం ఫస్ట్ క్లాస్ నమోదైంది. 80 శాతం డిస్టింక్షన్ వచ్చింది. విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

వాటర్ ప్లాంట్ల ప్రారంభం



ఉదయగిరి: తాగునీరు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, నేతలు

కొండాపురం: మండలంలోని భీమవరప్పాడు ఎస్సీ కాలనీలో వీపీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఉదయగిరి అంటే తనకు చాలా ఇష్టమని, ఇక్కడి ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కిందన్నారు.

- ఉదయగిరి: వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అమృతధార కింద మండలంలోని వెంకట్రావుపల్లిలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను మంగళవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్,మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నేతలు చెంచలబాబు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.
- జలదంకి: మండలంలోని చినక్రాక, తొమ్మిదో మైలు, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. బ్రాహ్మణక్రాక గ్రామంలో జరిగిన సమావేశంలో కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో ఇటీవల మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు.

గ్రంథాలయంలో సైన్స్ ప్రయోగాలు



సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు నిర్వహించారు. లైబ్రేరియన్ నారాయణరావు వారిని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఆత్మకూరు రూరల్: నారాయణ ఆరోగ్యమస్తు పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని దేపూరులో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి, చర్మ, చిన్నపిల్లలు, కాన్పులు, గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధి నిపుణులు పాల్గొని 300 మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి వైద్యం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు వెంకటరమణయ్య, శోని, రవికిరణ్, రాశి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు కొల్లా ఆదిశేషయ్య, నాయుడు పెంచలనాయుడు, దొడ్ల సుమన్, సిద్ధవటం ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

17న సర్వసభ్య సమావేశం

అనుమసముద్రంపేట: ఈనెల 17వ తేదీన ఏఎస్‌పేట మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు బోయళ్ల పద్మజారెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, ఉపాధి పనులు, వైద్యారోగ్యం, విద్య, పంచాయతీరాజ్, గృహ నిర్మాణం, వ్యవసాయ, ఇరిగేషన్, ఐసీడీఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉదయగిరిలో ర్యాలీ

ఉదయగిరి: పట్టణంలోని ఉర్దూ గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ జరిగింది. ఛలో ఉర్దూ గ్రంథాలయం పేరుతో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాధికారిణి షేక్.జబీన్, కార్యాలయ సబార్డినేట్ షేక్ షఫీ, మతపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

దర్గాలో వసతులు కల్పించండి

ఆత్మకూరు: పట్టణంలోని సుల్తాన్ షాహీద్ దర్గాలో విద్యుత్ బల్బులు, అంతర్గత రోడ్లు తదితర వసతులు కల్పించాలని ఆవాజ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. వసతుల ఏర్పాటు గురించి మంగళవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు తూర్పువీధిలో సంతకాల సేకరించారు. రోజూ ఒక్కో వార్డులో సంతకాలను సేకరిస్తామన్నారు. మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

ఉదయగిరి: కిశోరి వికాసంలో భాగంగా పట్టణంలోని హెచ్‌ఆర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీఓ వి.సునీత బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ చదివితే ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న అధ్యాపకురాలు షేక్ సల్మా

ఆత్మకూరు: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ (సాంకేతిక విద్య) పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు షేక్ సల్మా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్లొమా పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్‌ను మూడు సంవత్సరాల్లోనే పూర్తి చేయొచ్చని తెలిపారు. చిన్న వయసులోనే ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడొచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ ఎం.ప్రసాద్, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

రేపట్నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో గురు, శుక్ర, శని వారాల్లో గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరుగుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.గంగాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అరుంధతీయవాడ సచివాలయంలో క్యాంపు జరుగుతుందన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీలో బెల్టుషాపుపై మంగళవారం ఎక్సైజ్ ఎస్సై దీప్తికరంత్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



గంధాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సావలీ దర్గా ఆవరణలో ఉన్న హజరత్ ఉస్మాన్‌సావి రహంతుల్లా అలైహి గంధమహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంధాన్ని హక్కుదారుల ఇంటి నుంచి పురవీధుల్లో ఊరేగించి దర్గాకు చేర్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. గంధోత్సవం సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు.

గాలికొదిలేశారు!

- వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతున్న జనం



నిరుపయోగంగా మారిన వాటర్ ప్లాంట్

ఆత్మకూరు: గత ప్రభుత్వంలో కేవలం రూ.5కే 20 లీటర్ల తాగునీరు అందించిన పథకాన్ని మూసేశారని, వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. అనుమసముద్రం పంచాయతీ మజరా గండువారిపల్లి శివార్లలో నాడు బావిని తవ్వించారు. సమీపంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి తక్కువ ధరకే నీటిని అందించారు. సమీపంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, మండల కేంద్రం ఉండటంతో ప్రజలకు ఇది ఎంతో ఉపయోగపడింది. దీనికితోడు సమీప గ్రామాల్లో ప్లాస్టిక్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి ప్లాంట్ నుంచి నీటిని తరలించారు. అక్కడ సైతం ఇదే ధరకు నీరు అందించారు. కొన్నినెలలుగా కాంట్రాక్టర్ విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో పట్టించుకునే నాథుడేలేక ప్లాంట్ నిరుపయోగంగా మారిపోయింది. దాని చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ వ్యాపారుల వద్ద క్యాన్ నీటిని రూ.15 నుంచి రూ.20లకు కొనుగోలు చేస్తున్నారు. మండల అధికారులు పరిశీలించి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.